క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆర్.జంబులదిన్నె అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయ స్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణ స్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కర శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

'ఉపాధి'లో బదిలీలు



బదిలీలు నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నంద్యాల జిల్లా పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది సర్వీసును బట్టి బదిలీల ప్రక్రియ నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బదిలీల్లో కోర్సు డైరెక్టర్లు–ముగ్గురు, ఏపీఓలు–23, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు –19, టెక్నికల్ అసిస్టెంట్లు–76, కంప్యూటర్ ఆపరేటర్లు–43, బీఎఫ్‌టీలు 18, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ ఒకరిని కేడర్ల వారీగా సర్వీసును బట్టి బదిలీలు పకడ్బందీగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ వెంకటసుబ్బయ్య, సూపరింటెండెంట్ వహాబ్, హెచ్‌ఆర్ స్వరూపారాణి పాల్గొన్నారు.

ఢిల్లీ ఉగాది ఉత్సవాలకు ఎంపిక



ఎంపికైన శ్రీ సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ సాంస్కృతి శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఆంధ్రభవన్‌లో జరిగే ఉగాది ఉత్సవాలకు నంద్యాలకు చెందిన శ్రీ సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం విద్యార్థులు ఎంపికయ్యారని కూచిపూడి గురువు పల్లంశెట్టి సురేష్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూచిపూడి విభాగంలో ఈనెల 29, 30 తేదీల్లో ఆంధ్ర భవన్‌లో జరిగే ఉత్సవాలకు పదిమంది కళాకారులు కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తారని చెప్పారు.

అవినీతిపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో జరుగుతున్న అవినీతిపై జిల్లా ఎస్పీ సమగ్ర విచారణ జరిపించి తగు చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో అధికారులు నిబంధనలు, చలానా పేరుతో మామూళ్ల వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనల పేరుతో ప్రజలను, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఆటో స్టిక్కర్లపై చలానా రూపంలో ట్రాఫిక్ పోలీసులు అవినీతికి పాల్పడుతున్నారన్నారు. వీటిపై విచారణ జరిపించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య కన్వీనర్ సుశీలమ్మ పాల్గొన్నారు.

చిన్నకొప్పెర్లలో చోరీ

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్లలో శనివారం చోరీ జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి తాళం చెవిని ఇంటి గడపపైన పెట్టి మిరప కోత పనులకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం తెరిచి ఇంట్లోని బీరువాలో ఉన్న రూ. 1.50 లక్షల నగదు, అర తులం జుమికీలు అపహరించుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన దస్తగిరి ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండటంతో బీరువా తెరిచి చూడగా చోరీ జరిగిందని గుర్తించాడు. కాగా బీరువాలోనే మరో చోట ఉంచిన కొంత మొత్తం నగదు, బంగారు ఆభరణాలు దుండగులు గమనించకపోవడంతో సేఫ్‌గా ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ భూపాలుడు వివరాలు సేకరించి విచారణ చేస్తున్నారు.

పటిష్టమైన ఓటర్ల జాబితాకు కృషి

- ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి సూచనలివ్వండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి, పటిష్ట ఓటరు జాబితాకు, చట్టానికి అనుగుణంగా సూచనలు, సలహాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ గురించి ఈఆర్వో, డీఈఓల స్థాయిలో పరిష్కారం గాని ఏవైనా సమస్యలపై సలహాలివ్వొచ్చన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుసరించి జిల్లాలో పటిష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలన్నారు. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహించడానికి బలమైన, పారదర్శక ఎన్నికల ప్రక్రియ ఏర్పాటు కోసం రాజకీయ పార్టీలన్నీ తమవంతు సహకారం అందించాలన్నారు. 1200 పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజన, పోలింగ్ కేంద్ర భవనాల మార్పు, పోలింగ్ కేంద్రాలలో సమస్యల గుర్తింపు, బీఎల్‌ఏల మార్పు తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన అంశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్‌ఓ రామునాయక్, డోన్ ఆర్‌డీఓ నరసింహులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జయప్రసాద్, కాంగ్రెస్ నుంచి సయ్యద్ రియాజ్ బాషా, వైఎస్సార్‌సీపీ తరఫున సాయిరాం రెడ్డి, టీడీపీ నుంచి శివరామిరెడ్డి, బీజేపీ నుంచి కసెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల దరఖాస్తులను త్వరగా పరిష్కరించండి

సింగల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహిక పారిశ్రామికల వేత్తల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జవహర్ బాబు, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో మూడు నెలల్లో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం మొత్తం 22 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో 18 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని, ఇంకా 4 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం 32 యూనిట్లకు మొత్తం రూ.1.83 కోట్ల విలువైన రాయితీ లబ్ధి చేకూరిందన్నారు.

పేదరికాన్ని నిర్మూలించడమే పీ-4 లక్ష్యం

నంద్యాల: పేదరికాన్ని నిర్మూలించడమే పీ-4 (ప్రభుత్వ–ప్రైవేట్–ప్రజల–భాగస్వామ్య) వ్యవస్థ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పీ-4 విధానంపై చర్చ, అభిప్రాయ సేకరణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పీ-4 విధాన కార్యచరణ ప్రణాళిక రూపకల్పనకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధుల నుండి అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 5.97 లక్షల కుటుంబాలలో 20 లక్షల మంది జనాభా నివసిస్తున్నారని, అన్ని కుటుంబాలను సర్వే నిర్వహించి 4.5 లక్షల కుటుంబాలు పేదరికంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అనంతరం పేదరిక నిర్మూలన, ఉద్యోగాల సృష్టి, నైపుణ్యత పెంపు, రైతు సాధికారత, తాగునీటి రక్షణ, వరల్డ్ క్లాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్వచ్ఛ ఏపీ, మానవ వనరుల వినియోగం, శక్తి వనరుల నిర్వహణ, సాంకేతిక జ్ఞానం పెంపు తదితర పది సూత్రాల అనుసంధానంతో అభివృద్ధిపై అభిప్రాయాలు సేకరించారు. పట్టణ ప్రముఖులు రావిసూతుల వరప్రసాద్, ప్రభాకర్, రవికుమార్, మురళీధర్ రెడ్డి, రామచంద్రారెడ్డి పీ-4 పై అభిప్రాయాలు వెలుబుచ్చారు. డీఆర్‌ఓ రామునాయక్, సీపీఓ వేణుగోపాల్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: 2025–26 విద్యా సంవత్సరానికి కస్తూర్బా పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లలో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషలాఫీసర్ జ్యోతి శనివారం తెలిపారు. పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయని, ప్రవేశాలకు ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. బీపీఎల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ప్రవేశాలకు అర్హులన్నారు.

రిజిస్ట్రేషన్లు చేయించుకోండి

శిరివెళ్ల: రైతులందరూ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ఏఓ సుధాకర్ శనివారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, ప్రయోజనాలు పొందాలంటే తప్పకుండా రిజిస్ట్రేషన్లు చేయించుకొని ఐడీ నంబర్ పొందాలన్నారు. గ్రామ సభలలో రైతుల వివరాలను వెల్లడిస్తామన్నారు.

జీవ మనుగడకు నీరే ఆధారం

రుద్రవరం: జీవ మనుగడకు నీరే ఆదారమని రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం తమ పాఠశాల వద్ద ఇంకుడు గుంత ఏర్పాటు పనులు చేపట్టారు. అలాగే నీటి విశిష్టత, అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం, సుధాకర్, మధు, అనురాధ, ఇషాక్, విజయలక్ష్మి, లలిత, హరి, జ్యోతి ప్రియ తదితరులు ఉన్నారు.

నూర్‌బాషా సంఘం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందును ప్రారంభిస్తున్న సంఘం అధ్యక్షుడు ఆర్ మాబాషా

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండులో శనివారం నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు ఆర్.మాబాషా ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జామీయా మస్జీద్, సంక్షేమ సంఘం కార్యాలయంలో సుమారు వెయ్యి మందికి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ నెలలో ఉపవాస దీక్ష చేపట్టే వారికి సహేరిలో కానీ ఇఫ్తార్‌లో కానీ ఒక గ్లాసు నీళ్లిచ్చినా అల్లా సాధారణ రోజుల కంటే 70 రెట్లు పుణ్య ఫలం ఇస్తారన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు టి.పీరయ్య, ఉపాధ్యక్షులు పెద్ద బాషా, ప్రధానకార్యదర్శి మస్తాన్, కోశాధికారి లాల్‌బాషా, సహాయ కోశాధికారి ఇమాంబాషా, బీసీ సంఘం నాయకులు సల్లా నాగరాజు, సీఐటీయూ నాయకులు గుత్తి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దస్తగిరిస్వామి హుండీ ఆదాయం రూ.2.40 లక్షలు



హుండీ ఆదాయాన్ని పోలీసుల సమక్షంలో లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో వెలసిన హజ్రత్ దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా స్వామి వారి హుండీ ఆదాయం రూ.2.40 లక్షలు సమకూరినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహించిన ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన 4 హుండీలలో భక్తులు వేసిన నగదు, కానుకలను లెక్కించగా రూ.2.40 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. వాటిలో ఉరుసు నిర్వహణకు వెచ్చించిన ఖర్చులు పోగా మిగిలిన నగదు మొత్తాన్ని స్వామి వారి బీరువాలో కమిటీ వారి ఆధ్వర్యంలో భద్రపరచినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఉరుసు సందర్భంగా దస్తగిరి స్వామి పేరిట అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో దాతలు ఇచ్చిన విరాళాలు, బియ్యం, దినుసులు దుర్వినియోగం అయ్యాయని, వాటిపై పోలీసుల ఆధ్వర్యంలో విచారణ చేపట్టాలని కమిటీ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

కనీస వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

చాగలమర్రి: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనంతో పాటు పీఎఫ్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.ఏసు రత్నం, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం చాగలమర్రి సంత మార్కెట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు ఏ నిధులతో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డు, పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇతరులెవ్వరు చేయలేని పనులను చేస్తూ ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ చాలీ చాలనీ జీతాలతో జీవితం వెళ్లదీస్తున్నారన్నారు. సమావేశంలో స్థానిక పంచాయతీ కార్మికులు రాజు, బాబు, ఏసన్న, బుజ్జి, పవన్, సునీత, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.21.58 లక్షల విలువైన బయో మందుల సీజ్




బయో మందుల బిల్లును పరిశీలిస్తున్న స్క్వాడ్ అధికారి అంజనేయ, ఏఓ రంగనేతాజీ


చాగలమర్రి: మండల కేంద్రంలోని రైతు ఆగ్రో ఏజెన్సీస్, శ్రీలక్ష్మీవెంకటేశ్వర ట్రేడర్స్‌పై శనివారం ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి ఆంజనేయ, స్థానిక ఏఓ రంగనేతాజీ ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆయా షాపుల్లో కొనుగోలుకు సంబంధించి సరైన బిల్లులు లేని రూ.21.58 లక్షల విలువజేసే బయో మందులను సీజ్ చేసి, వాటి విక్రయాలను నిలిపి వేసినట్లు వారు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా చాగలమర్రిలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్, రైతు ఆగ్రో ఏజెన్సీస్‌లలో తనిఖీ నిర్వహించగా బయో ఉత్పత్తి ఎరువుల కొనుగోలు, అమ్మకాల రిజిస్టర్లు, బిల్లులను పరిశీలించామన్నారు. సరైన బిల్లులు, పత్రాలు లేనందున రైతు ఆగ్రో ఏజెన్సీస్‌లో రూ.19.9 లక్షలు, శ్రీలక్ష్మీవెంకటేశ్వర ట్రేడర్స్‌లో రూ.2.49లక్షల విలువైన మందులను సీజ్ చేసి, వాటి విక్రయాలను నిలిపి వేశామన్నారు. డీలర్లందరూ ప్రభుత్వ అనుమతి పొందిన బయో ఎరువులను మాత్రమే విక్రయించాలని సూచించారు.

భక్తులకు బ్యాగు అప్పగింత

మహానంది: కర్ణాటక రాష్ట్రం భాగల్‌కోట్‌కు చెందిన లక్ష్మి, సవిత కుటుంబ సభ్యులతో మహానందికి వచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించి వెళ్లే సమయంలో వారి బ్యాగును శనివారం కోనేటి వద్ద మర్చిపోయారు. గుర్తించిన భక్తులు హోంగార్డు కోటయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ద్వారా సీసీ కెమెరాలు పరిశీలించి భక్తులను గుర్తించి వారికి అందజేశారు. బ్యాగులో రూ.5 వేల నగదు, విలువైన కార్డులు ఉన్నట్లు భక్తులు తెలిపారు. ఆలయ సిబ్బందికి భక్తులు కతజ్ఞతలు తెలిపారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు





గాయపడిన రామాంజనేయులు, శివకుమార్

ఉయ్యాలవాడ: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్ అండ్‌బీ రహదారిలో మండలంలోని అల్లూరు వద్ద శనివారం రాత్రి ఆటో బోల్తా పడింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు..అవుకు మండలం రాళ్ల కొత్తూరుకు చెందిన శారదాబాయి, దేవిబాయి, కేసీబాయి పండ్ల వ్యాపారం నిమిత్తం బనగానపల్లె మండలం పాతపాడుకు చెందిన శివకుమార్ ఆటోను బాడుగకు తీసుకున్నారు. ఉయ్యాలవాడ మండలంలో వ్యాపారం ముగించుకుని, తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. కోవెలకుంట్ల మండలం గుంజలపాడుకు చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి ఇదే ఆటోలో మాయలూరు వద్ద ఎక్కాడు. ఆటో అల్లూరు సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఐదుగురు గాయపడ్డారు. గ్రామస్తులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం వారిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉయ్యాలవాడ పోలీసులు ఘటనపై విచారణ జరుపుతున్నారు.

చికెన్ సెంటర్ల సీజ్



చికెన్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ: పట్టణంలోని పలు చికెన్ సెంటర్లను శనివారం మున్సిపల్ కమిషనర్ కిశోర్ సీజ్ చేశారు. పశుసంవర్ధక శాఖ ఉత్తర్వుల మేరకు ఏఎన్‌ఆర్, ఏఎన్‌ఆర్–2, హెచ్‌ఎంకే, హెచ్‌ఎంకే–2 సెంటర్లపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కర్నూలు, విజయవాడలోని ల్యాబ్‌లకు ఇటీవల పంపిన ఈ షాపులకు సంబంధించిన చికెన్ నమూనాల్లో తేడాలు రావడంతో సీజ్ చేశామన్నారు.

చిన్నారులకు నాణ్యమైన విద్యనందించాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ పద్మావతి

గోస్పాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలని ఏసీడీపీఓ పద్మావతి అన్నారు. మండల కేంద్రంలో మూడు రోజుల పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీప్రైమరీ స్కూళ్లుగా మారుతున్నాయన్నారు. చిన్నారులకు ఆటాపాటలతో కూడిన చదువులు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాలను పెంపొందించడంలో భాగంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా కార్యకర్తలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

వన్యప్రాణుల దాహం తీర్చేందుకు చర్యలు



పెద్దకంబలూరు బీట్ సాసర్ పిట్‌లో నీరు నింపుతున్న దృశ్యం

రుద్రవరం: నల్లమల అటవీ సంరక్షణతో పాటు వన్య ప్రాణుల దాహం తీర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు పెద్దకంబలూరు సెక్షన్ అధికారి కిషోర్ తెలిపారు. పెద్దకంబలూరు బీట్ అటవీ ప్రాంతంలో ఉన్న సాసర్ పిట్లను శనివారం నీటితో నింపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో అడవిలో నీటి నిల్వలు లేకుండా పోయాయన్నారు. దీంతో అడవిలో ఉండే జంతువులు దాహంతో అలమటిస్తాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో చెలిమ రేంజి అధికారి ఉదయ్‌దీప్ ఆధ్వర్యంలో అడవి జంతువుల దాహం తీర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముందుగా పెద్దకంబలూరు బీట్‌లో ఎఫ్‌బీఓ రామారావు దగ్గరుండి ట్యాంకర్ నీరు తీసుకెళ్లి అడవిలోని సాసర్ పిట్లను నింపినట్లు ఆయన తెలిపారు. వర్షాలు కురిసే వరకు సాసర్ పిట్లలో నీరు నింపుతూనే ఉంటామని తెలిపారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి మూల్యాంకనం కేంద్రంలో వసతులు కల్పించాలని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 60 సంవత్సరాలు పైబడిన వారికి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య కోరారు. ఈమేరకు శనివారం డీఈఓ జనార్దన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ మూల్యాంకన కేంద్రంలో వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. మూల్యాంకనానికి సంబంధించిన స్పెషల్ అసిస్టెంట్ వారికి డ్యూటీ వేయాలన్నారు. భోజన వసతి, కూల్ వాటర్ కల్పించాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో పాల్గొన్న చీఫ్ డిపార్టుమెంటల్, ఇన్విజిలేటర్స్‌కు రెమ్యునరేషన్ వెంటనే మంజూరు చేయాలన్నారు. స్పాట్ ముగిసిన వెంటనే సిబ్బందికి రెమ్యునరేషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. నాయకులు జాకీర్‌హుసేన్, కన్నయ్య, హుసేన్‌మియా పాల్గొన్నారు. అలాగే.. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్, కార్యదర్శి అరవింద్ డీఈఓకు వినతి పత్రం అందజేశారు.

అహోబిలం పీఠాధిపతికి తిరుమలలో సత్కారం



తిరుమలలో అహోబిలం పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న అధికారులు, అర్చకులు

ఆళ్లగడ్డ : అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప శ్రీరంగరాజ యతీంద్ర మహాదేశికులను తిరుమల తిరుపతి దేవస్థానం శనివారం సత్కరించింది. సాంప్రదాయ మంగళశాసనం కార్యక్రమంలో భాగంగా ఆలయం వద్దకు చేరుకున్న పీఠాధిపతికి తిరుమల ఆలయ సంప్రదాయం ప్రకారం కార్యనిర్వహణాధికారి సమక్షంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి మహాద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి ఆచార్యుల సమక్షంలో స్వామివారిని దర్శించుకుని మంగళశాసనం చేయడం జరిగింది. అనంతరం టీటీడీ అధికారులు ఛత్ర చామర గజ తురగాది సమస్త రాజోపచారములతో తిరుమలలోని అహోబిలం మఠానికి తీసుకువచ్చారు. అహోబిలం మఠం వద్ద టీటీడీ ఈఓ అశోక్ సింఘాల్, జేఈఓ శ్రీనివాసరాజు పీఠాధిపతి ఆశీస్సులు అందుకున్నారు.

హాస్టల్ వార్డెన్‌పై పోక్సో కేసు

బొమ్మలసత్రం: పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఓ ప్రైవేట్ పాఠశాలలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఎన్‌జీవోస్ కాలనీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఓ యువకుడు హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. పొన్నాపురం కాలనీకి చెందిన ఓ మహిళ అదే పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తుంది. మహిళ మనుమరాలు 9వ తరగతి చదువు ఇటీవల చదువు మానేసింది. ఖాళీగా ఉండటంతో సదరు మహిళ వెంట బాలిక కూడా పాఠశాలకు వెళ్తోంది. అక్కడ ఆ యువకుడు బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం బాలికకు మాయమాటలు చెప్పి తిరుపతికి తీసుకెళ్లి అక్కడ పలుమార్లు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మహిళ నంద్యాల తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

బొమ్మలసత్రం: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా అన్నారు. శనివారం స్థానిక ట్రాఫిక్ స్టేషన్ సమీపంలో 200 మంది విద్యార్థులతో పాటు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జరిమానాలపై వాహనదారులు అవగాహన కలిగిఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగిఉండాలని సూచించారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను తరలించటం ప్రమాదకరమని దీనికి జరిమాన అధికంగా ఉంటుందని హెచ్చరించారు. బైక్, కార్లు నడిపేటప్పుడూ వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని కోరారు.